


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకి కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మా పీటలు మావే!

**ఒక అబ్బాయి స్టేజ్ ఎక్కి** ఇరవై నిమిషాల సేపు తెలుగు సాహిత్యంలో కథలు ఇద్దరే రచయితలు రాయగలరని నొక్కి వక్కాణించాడు. ఒక ఆయన నాకు తెలుసు, రెండో మూడో కథలు చదివాను. రెండో అతను బ్లాగుల్లో రాసే రచయితట. నాకు తెలిసే అవకాశంలేదు. నేను బ్లాగులు ఎవరైనా లింక్‌లు పంపిస్తే తప్ప చదవను. వాళ్ళు ఏం రాస్తారో కానీ నాకు మాత్రం మా పిన్నత్తగారు 'దుగ్గిరాల సత్యవతే రాయాలే. కథ రాస్తే' అనడం గుర్తొచ్చింది. దుగ్గిరాల సత్యవతి వాళ్ళ ఇంటి పక్కన తెనాలిలో వుండేదిట. వాళ్ళ చిన్నప్పుడోసారి భారతికి కథ రాస్తే అది వారం తరువాత తిరిగొచ్చింది. రెండు ఏనుగులు పెళ్ళి చేసుకుని 'నువ్వు మొగుడివి కాబట్టి పని నువ్వే చెయ్యాలి' అంటే, 'నువ్వు పెళ్ళానివి కనుక పని నువ్వే చెయ్యాలి' అని పోట్లాడుకునే కథట. అది కాస్త పత్రికలు చదివే అలవాటున్న ఈవిడకి చూపిస్తే, 'ఈ కథ భేషుగ్గా వుంది పిల్లా' అని ఈవిడ కితాబులు ఇచ్చేసిందిట. కానీ పత్రిక వాళ్ళు తిరగగొట్టారు పాపం. అయినా మా పిన్నత్తగారికి 'దుగ్గిరాల సత్యవతిని' మించి కథ రాసిన వాళ్ళు లేరు. ఆవిడ చదివిన పన్నెండు కథల్లోనూ. ఇంట్లో వున్న ఆరుగురిలోకీ మా క్రరి బుజ్జిగాడే తెలుపందట ఒకావిడ.

అలాగే ఈ రచయిత స్టేజ్ ఎక్కి తనకి తెలిసిన ఇద్దరు రచయితల గురించి ఇరవై నిమిషాల పాటు 'వాళ్ళు రాసినవే కథలు' అని మాట్లాడాను అనుకుని దిగిపోయాడు.

తరువాత ముప్పై పేజీలు ఇంకొకావిడ చదివింది. అందులో కొంచెంగా సోషల్ స్టడీస్ వినిపించింది. అంటే మా సోషల్ స్టడీస్ క్లాస్ మధ్యాహ్నం ఇంటికెళ్ళి పెరుగూ, మాగాయీ వేసుకుని తినొచ్చాకా, లాస్ట్ పిరియడ్ మా మార్త ప్రభూ టీచర్ చరిత్ర పాఠం చెప్తుంటే కళ్ళు కూరుకుపోయి, బెంచ్ మీదకి వాలిపోయేదాన్ని. ఓరోజు మార్తప్రభూ టీచర్ నా చెవినెప్పి పుట్టేట్లు మెలిపెట్టి 'రోజా నా క్లాసులో నిద్రపోతోంది ఒక్క ముక్క వినదు' అని కంప్లైంట్ చేసింది. మా హెడ్ మాస్టర్ జార్జ్ సార్ ప్రపంచం చూసినవాడు. "నేను మూడోసారి అమెరికా వెళ్ళివచ్చినప్పుడూ" అని ప్రసంగం ఆరంభించేవాడు. ఆయన ఎన్నిసార్లు మిషనరీల తరపున అమెరికా, ఇజ్రాయెల్ లాంటి దేశాలు వెళ్ళి వచ్చాడో మాకు లెక్క తెలియడానికి. ఆయన ఎగాదిగా చూసి "ఏ క్లాసులో నిద్రపోకుండా వుండగలవూ?" అని అడిగాడు.

"చిన్న తెలుగు పండిట్ క్లాసులో" అన్నాను తడుముకోకుండా. ఆయన వెంటనే మాకు మధ్యాహ్నం చివరి పిరియడ్ తెలుగు క్లాస్ పెట్టించాడు. మా చిన్న తెలుగు పండిట్, పద్యం చదువుతూ ప్రతిపదార్థం చెప్తుంటే, నా నిద్రంతా ఎగిరిపోయేది. 'యమతారాజభానసలగం' అని రాసి పద్యం చదువుతుంటేనే గణవిభజన చేసేదాన్ని వుషారుగా. ఓ వారం తర్వాత హెడ్ మాస్టర్ చిన్న

తెలుగు పండిట్ నూకల సీతారామశాస్త్రిగారిని పిలిచి, నా నిద్ర విషయం కనుక్కుని, ఆయన రిపోర్ట్‌కి ఆనందపడి, మార్తప్రభు టీచర్ని పిలిచి" పిల్లల్ని నిద్రపుచ్చేందుకు కాదు నీకు జీతం ఇవ్వడం.. వాళ్ళు నిద్రపోవడం నీ తప్పు. వాళ్ళ తప్పుకాదు.' అని మందలించి పంపారు. ఆవిడ స్టాఫ్ రూంలో కర్చీఫ్‌లో ఏడ్చి, దాన్ని కిటికీ వూచల మీద ఆరేసిందని మా యాస్మీన్ చెప్పింది.

ఆ విధంగా నిద్రపోయి లేచి, మిగతా సభవారి స్థితికూడా అలాగే వుందా అని చూసా.. తమాషా.. వరండాలో ఇస్తున్న 'టీ' కోసం అందరూ వెళ్ళిపోయి కుమ్ములాడుకుంటున్నారు. అమెరికాలో 'క్యూ' పాటించక పోవడం ఆ ఒక్కసారే చూసాను.

ఆర్గనైజర్ని పిలిచి 'నేనింకా మాట్లాడనే లేదు. ఇరవైమందిలో పదిమందిని టీ పేరు చెప్పి ఎందుకు బయటకి పంపారూ? వాళ్ళు లోపలికి వస్తారనేనా మీ అభిప్రాయం? ఆయ్.. ' అని కోప్పడ్డాను. ఆ కుర్రాడు ఒక 'ఇస్మయిల్' ఇచ్చి 'చూద్దాం.. ఎవరైనా పిలిచి కూర్చోపెట్టగలరేమో!' అన్నాడు.

నాకు ఆత్మీయుడైన ఓ పెద్దాయన లేచి 'అమెరికా రచయితలు రాసే రచనలు అంటే భారతదేశంలో చిన్నచూపు' అన్నాడు. ఆ ఒక్క పాయింట్ గురించే నేను ఆలోచిస్తూ కూర్చున్నాను. ఎన్నో కథలు చదివాను. వాళ్ళు ఏ వూరివాళ్ళో, ఏ దేశం నుండి రాసారో నాకు తెలీనే తెలీదు. ఈ సదరు పెద్దమనిషి 'అమెరికా' అని నాకు ఆయన కథలు చదివినప్పుడు తెలీదు. అలాగే మిగతా రైటర్స్‌ని కూడా వాళ్ళు తెనాలి నుండి రాస్తున్నారో 'బే ఏరియా' నుండి రాస్తున్నారో వాకబు చేసి చదవలేదు.

ఓసారి నా మిత్రుడు అచ్చేసిన పుస్తకం ఒకటి చదివి ఆ కథల్లో 'పస' లేదంటే, ఆయన కోప్పడి 'షి ఈజ్ వరల్డ్ ఫేమస్ ఇన్ అవర్ ఊరు" అన్నారు. అలాగే ఈ మధ్య ఓ ప్రోగ్రామ్‌లో తెగ అపశ్రుతులు పాడ్తున్న అమ్మాయి పాట గురించి ఎవరో పెద్దాయన 'ఎలావుంది?' అని నన్ను అడిగితే 'కత్తిరింపు జుట్టూ, డిజైనర్ బ్లౌజూ, రోల్డ్‌గోల్డ్ చీరా (ఆ తీగలన్నీ అవేగా) బావున్నాయి' అన్నాను. మా అమ్మమ్మ చెప్పేది 'వాక్కాయి పచ్చడి ఎలా వుందిరా అబ్బీ?' అంటే మా మావయ్య 'తెలకపిండి కూర బావుంది' అనేవాడుట. "ముక్కల పులుసు ఎలా వుందిరా?" అంటే 'నీ చేతిమెంతి మజ్జిగే మెంతి మజ్జిగ కక్కీ' అనేవాడుట. అందుకే మనం బావున్నవి చెప్పాలి అని నేర్చుకున్నాను. కాస్త పెద్దముక్కుతో వున్న అమ్మాయిని చూపించి "ఈ అందగత్తె నీకు తెలుసా?" అన్నాడొకాయన. నేను అయోమయంగా చుట్టూ చూసి "అందగత్తే? ఎవరూ?" అంటే, ఆ అమ్మాయి మొహం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. అప్పుడు అర్థమైంది నేను చేసిన పొరపాటు. అప్పటి నుండీ వాళ్ళమ్మ తెలుగు సీరియల్స్‌ని అదే పనిగా ఫేస్‌బుక్‌లో తిట్టడం మొదలు పెట్టింది.

ఇంకొక అమ్మాయి కవితలు రాయడం మొదలుపెట్టి 'నాలుగు ఆదివారాలు' అయిందిట. స్టేజ్ ఎక్కి అదే పనిగా. 'ఆ వాదం... ఈ పాదం.. ఇవేవీ కవితలు కాదు. వాళ్ళు రెచ్చగొట్టే అతివాదులు. ' అన్నిన్నూ. 'మన అనుభవాలూ, జ్ఞాపకాలూ నుండి మాత్రమే కవితలు రాయాలి' అన్నిన్నూనూ. 'దట్స్ ఆల్.. భూమి ఈజ్ రౌండ్' అన్నంత గంటాపథంగా చెప్పేసింది. అయ్యో.. నేనీ ఫిక్షన్ అంతా వూహించి రాసేసానే అనవసరంగా. అలా రాయకూడదుట అని నాలిక కొరుక్కుని బాధపడేలోగా ఓ పెద్దాయన పాపం లేచి 'మరి వూహా మాటేవిటీ? వూహించి కవితలు అల్లకూడదా? ' అన్నాడు. 'మేఘుడు రాల్చిన కన్నీళ్ళు. దోసిళ్ళతో పట్టిన ప్రియురాలు పుడమి' అని నేనొకసారి రాసా - 'ఆయ్. నీకు మేఘుడు ఏడుస్తూ వుత్తరం రాసాడా? ఎస్.ఎమ్.ఎస్ ఇచ్చాడా?' అంటే ఏం చెప్పనూ? అయినా సర్వం తెలుసు అన్నట్లుగా ధీరగంభీర వదనంతో వున్న ఆ అమ్మాయి ఏం సమాధానం చెప్తుందోనని ఒక్కింత వుత్సుకతతో చూసాను. అప్పటిదాకా అనుభవాలు, జ్ఞాపకాల్లోంచే రాయాలి. అని శాసించిన ఆ పిల్ల "ఊహల్లోంచి కూడా రాయొచ్చు" అని తేల్చిపారేసింది.

ఎవరో పెళ్ళిళ్ళ పేరమ్మలు అంటే (మేట్రిమోనియల్ ఫోరమ్) వాళ్ళు చెయ్యి పట్టుకు లాక్కెళితే వెళ్ళి నాలుగు జోకులు చెప్పొచ్చా. ఒకావిడ ఆ మధ్య నాతో "ఆడపిల్లలు దొరకడం లేదు. ఈ సంవత్సరం అంతా మగపిల్లల పెళ్ళిళ్ళే అయ్యాయి." అంది. నేను నోరు తెరిచేసా. 'ఎవరితో? ' అని అడగలేక. ఆ పెళ్ళివారి మధ్య నుండి నన్ను విమెన్స్ ఫోరమ్ వాళ్ళు రెక్కుచ్చుకు లాక్కెళ్ళారు.

అక్కడ ఒక మిస్ అమెరికా బ్యూటీ మాట్లాడ్తోంది. నిజంగా అందమైన అమ్మాయి. మా మిత్రుడు ఓ అమ్మాయిని చూపించి "ఈ అమ్మాయిలా ఎవరూ కవితలు రాయలేరు" అన్నాడు. "మీ వూళ్ళోనా?" అని అడిగా.

ఇందాకా 'అందగత్తె' అంటే ఎక్కడా? అని అడిగా. అలాంటి అందగత్తెకాదు. నిజంగా అందగత్తె. ఆ అమ్మాయి 'కాన్ఫిడెన్స్'కి పొట్టి గౌన్ వేసినట్లుంది. భలే మాట్లాడింది. అందమైన అమ్మాయిలు తెలివిగా వుండరు అన్నట్లు సినిమాల్లో హీరో వేసే ఫూలిష్ ట్రాప్‌లకి పడిపోతూ వుంటారు హీరోయిన్స్ పాపం. కానీ, ఐశ్వర్యారాయ్, సుస్మితాసేన్, దియా మీర్జా, ప్రియాంకా చోప్రాలు, డయానాహెడెన్‌లు అందాల పోటీల్లో తెలివైన జవాబులు ఇచ్చారు. ఈ అమ్మాయిని కూడా ప్రసంగం అయిపోయాకా 'నీ అందాల పోటీలూ, మోడలింగూ, చదువూ ఎలా బ్యాలెన్స్ చేస్తావు? ' అని సభకి వచ్చిన వాళ్ళు కొందరు అడిగారు. ఆ అమ్మాయి తండ్రి కూడా వీడియో తీస్తూ అదే ప్రశ్న ఏవీ ఎరగనట్టు అడిగాడు. ఆ అమ్మాయి 'ఐ యాం గుడ్. ఐ కెన్ మానేజ్" అని ఏదో చెప్పింది. కానీ నాకు మైక్ దొరికాక నేను చెప్పాను "మేరీకామ్ సినిమా చూసారా? ఆ అమ్మాయి రోజుకి ఎన్ని గంటలు ప్రాక్టీస్ చేసిందో తెలుసా? ఆ అమ్మాయిని నీ బాక్సింగూ, చదువూ ఎలా మేనేజ్ చేస్తావు? అనో.. మా పి.వి సింధుని 'మేత్స్‌లో ఎన్ని మార్కులొచ్చాయి నీకు?' అనో ప్రశ్నలు వేస్తే ఏం చెప్తారు? ప్రపంచంలో మన భారతదేశపు వునికిని చాటి నాలుగుసార్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ తెచ్చిపెట్టిన అమ్మాయీ, రోజుకి పదిగంటలు ప్రాక్టీస్ చేసే అమ్మాయీ ఈ స్కూల్ పరీక్షల్లో కూడా ఫస్ట్‌మార్కు తెచ్చుకోవాలి అని కోరడం అత్యాశ కదా! " నన్ను ఎవరైనా నువ్వు ఐ.ఏ.ఎస్ కానీ మెడిసిన్ కానీ ఎందుకు చెయ్యలేదంటే, చదువు నా ఆప్షన్ కాదు అనే చెప్తాను. మార్తప్రభూ టీచర్ తక్కువ మార్కులు వేసిందని చెప్పనుగాక చెప్పను.

ఆ ఫోరమ్‌లో నా భాగ్యవశాత్తూ అంతా ఆడపిల్లలేగా. సీతాకోక చిలుకల్లా తయ్యారయి వచ్చారు. నన్ను టీ.వీ, సినిమా, నవలా, సెన్సార్‌బోర్డ్ మీద రకరకాల ప్రశ్నలు వేసారు. నేను నా జీవిత చరిత్ర మొదలు పెట్టా. ప్యూపా దశ నుండి లార్వా స్టేజ్‌కి వచ్చేసరికి ఆపకుండా చప్పట్లు కొట్టారు. టక్కున ఆపేసి 'టైం అయిపోయిందా?' అన్నా. అబ్బే ఇంకా మాట్లాడండీ. బావుందీ అనడానికి కూడా చప్పట్లు గుర్తే అన్నారు. ధైర్యం తెచ్చుకుని నిరాఘాటంగా ఇంకో ఇరవైనిమిషాలు సేపు మాట్లాడేసా. అమ్మాయిలు రకరకాల ప్రశ్నలు వేసారు. ఓ పెద్దావిడ 'మీ టీ.వీ సీరియళ్ళలో వస్త్రధారణ అసభ్యంగా వుంది' అంది. ఆవిడకి పాపం అర్జెంటుగా కళ్ళజోడు మార్పించాలి. మా హీరోయిన్లూ, ఆడ విలన్లూ ఒళ్ళంతా చీరకట్టుకుని, చీర కవర్ చెయ్యలేని చోట్ల నగలతో శరీరాన్ని కప్పుకుని మేనేజ్ చేస్తారు. మిగతావాళ్ళు 'ఒకటి రెండు ఎపిసోడ్లలో ముగించండి సీరియల్' అని అమూల్యమైన అభిప్రాయం చెపితే 'రిమోట్' అనే వజ్రాయుధం మీ చేతనుండగా ఎందుకమ్మా భయం? అని నేను సూచించాను.

ఆడపిల్లలు తెగ చప్పట్లు కొట్టి, నాతో ఫోటోలు అవీ తీయించుకున్నాకా, మళ్ళీ మా సాహిత్య సభకి విచ్చేసా. నేను రాసిన నవల 'ఎందుకీ సందెగాలి?' కూడా ఆ పూటే ఆవిష్కరణ మరి.

నా నవలని పేక్ చేయించుకు రమ్మని మా డ్రైవర్ కుమార్‌ని పంపిస్తే, వాడు దాన్ని పెళ్ళిళ్ళలో పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురి చేతా ఇప్పించడానికి పొట్లం మీద పొట్లం ఓ పది పొరలు కట్టి, లోపల ఓ పాల పీక పెట్టినట్టూ గట్టిగా బందోబస్తుగా ప్యాక్ చేయించుకొచ్చాడు. మా ఆవిష్కర్త దుశ్శాసనుడిలా ఆ పొరలన్నీ చింపాక, నా పుస్తకం 'ఎందుకీ సందెగాలి?' ఆవిష్కరింపబడింది.

నేను మాట్లాడేలోగా ఇంకొకాయన ఓ చిట్టా చదువుకొచ్చాడు. నవలా సాహిత్యం గురించి అరవైలనుండీ ప్రయాణం మొదలు పెట్టి తొంభైలదాకా వచ్చేసాడు. నేను అతను చదువుతున్న పేర్లలో నాకు తెలిసిన కొందరు వుండటంతో వుబ్బితబ్బిబ్బు అవుతున్నా. కానీ అతను ముగించేసరికి 'ఖంగు' తిన్నా. ఎందుకంటే 'నవల' అనే సబ్జెక్ట్ యాభై గంటల సేపు రీసెర్చ్ చేసి రాసుకొచ్చా అని చెప్పిన ఆ పెద్ద మనిషి నాకు తెలిసిన ప్రముఖుల ఎవరిపేర్లూ చదవలేదు.

ఏతావాతా తేలిందేవిటంటే వారు కమర్షియల్ రైటర్స్‌ని అసలు సాహిత్యంలోంచి తీసిపారేసారుట. అసలు ఆడవాళ్ళకి నవలలు చదవడం అలవాటు చేసిన మా 'యద్దనపూడి సులోచనారాణిగారి' వూసేలేదు. చివర్లో మాత్రం కంటి తుడుపుగా "ఓసారి నవల విషయంలో యండమూరి వీరేంద్రనాథ్‌కి చప్పట్లు కొడదామా?" అన్నాడు.

మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి కలానికి కూడా స్థానం ఇవ్వలేదు. అసలు కొవ్వలి, కొమ్మూరి సాంబశివరావుగార్ల పేర్లు ప్రస్తావించలేదు. ఎందుకంటే వీళ్ళంతా కమర్షియల్ రైటర్స్‌ట. గుడిపాటి వెంకట చలంగారు కూడా మాయం అయ్యారు. కమర్షియల్ రైటర్స్ అంటే పుస్తకాలు చదివించడం, డబ్బులు పెట్టి కొనడం నేర్పించినవారు. వాళ్ళంతా అస్పృశ్యులయ్యారు. కానీ విశ్వనాధ వారి పేరు చదివారు. పాపం ఆయనా కమర్షియల్ రైటరే అని వారికి తెలీలేదు. 'ఏకవీర'ని మించిన కమర్షియల్ సాహిత్యం వుందా? రవీంద్రనాథ్ టాగోర్ 'పడవ మునక' నాలుగు భాషల్లో సినిమాగా వచ్చింది. ఇద్దరు అగ్రహీరోలతో 'చరణదాసి' సినిమాగా తెలుగులో వచ్చింది.

సాహిత్యంలో యద్దనపూడికి ఒకరు పీట వేసి కూర్చోపెట్టఖర్లా. ఆవిడ్ని తెలుగు ప్రజలు ఎప్పుడో నవలారాణిని చేసి కీర్తికిరీటాలు పెట్టారు. ఆవిడ నవలలు రాసి తను మాత్రమే డబ్బు సంపాదించలేదు. ఎందరో పబ్లిషర్స్‌నీ, పత్రికలనీ బ్రతికించింది. పుస్తకాలు అద్దెకి తెచ్చుకోవడం, కొనడం తెలుగు వారికి అలవాటు చేసిందావిడ. సామాజిక స్పృహలేని రచనలు అని గొడవపెట్టే వర్గం రచయితలు తెలుసుకోవలసిందేవిటంటే. ఆనందంగా అందంగా జీవితాన్ని మలచుకోండని ఆవిడ చెప్పింది. అంతకన్నా పనికొచ్చే సామాజిక స్పృహ ఇంకోటి లేదు.

యండమూరీ, మల్లాది మా తరాన్ని తమ ఉద్విగ్నమైన నవలలతో వుర్రూతలూగించారు. అవి యువతకి కొన్నిసార్లు భవిష్యత్తు పై ఆశలు కల్పించాయి.

ఎంతోసేపూ క్షుద్రసాహిత్యం అని తులసీదళం మీద విరుచుకు పడ్తారే కానీ, అది తెలంగాణాలో వెనుకబడ్డ ప్రాంతాలలో కూడా నవలల మీద ఆసక్తి కలిగించిన నవల. 'డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు' ఆయన రాసిన కొత్తల్లో యువకులు సెల్ఫ్ ఎంప్లాయింట్ స్కీమ్ మీద ఇంట్రెస్ట్ పెరిగి సొంతంగా డబ్బు సంపాదించడం మొదలు పెట్టారు. మన రాష్ట్రంలోనే కాదు పక్క రాష్ట్రాల్లో కూడా 'దుడ్డు' అని ఆటోల మీద రాసుకుని నడిపారు. విజయానికి ఐదుమెట్లు కూడా ఆ కమర్షియల్ రైటర్ కలం నుండే వచ్చి నాబోటి వాళ్ళ జీవితాలకి 'లక్ష్యం చేరుకోకపోవడం తప్పుకాదు. లక్ష్యం లేకపోవడం నేరం' అని ప్రభోధించి ఓ మలుపు తిప్పింది.

మల్లాదిగారి అందమైన జీవితం, పెళ్లైన కొత్తల్లో చదివి, చిన్న చిన్న విషయాల్లో ఆనందం ఎలా పొందాలో తెలుసుకున్నాను. మొన్న ఓ స్నేహితురాలు 'చంటబ్బాయ్' నవల చదివి అదెలాగైనా అమెరికాలో తన డెలివరీలోపు చూడాలని కష్టపడి సంపాదించి అది చూసాకే పురుడొచ్చిందని చెప్పారు. ఇరవైల వయసులో ఆ అందమైన జీవితం నన్ను ఆలోచింపచేసినట్లే, మళ్ళీ ఈ వయసులో 'విధాత' నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించి, జీవనగమ్యం నిర్దేశించింది. మన కోసం మనం కాదు. ఇతరుల కోసం బ్రతికే టైం వచ్చిందని అర్ధమైంది. నేను రెండు టీ.వీ సీరియల్స్ రాసి ఒకటి మన కుటుంబం కోసం, రెండోది మన రేషన్ కార్డ్‌లో లేనివాళ్ళకోసం అని నిర్ణయించుకునేట్లు చేసింది 'విధాత'.

కమర్షియల్ రైటర్స్ అంటే నాకు తెలిసిన తేడా ఏవిటంటే మూడ్ మేం పిలిస్తే రావాలి. దానికోసం మనం వెయిట్ చెయ్యడం కాదు అని తెలుసుకోవడం. మేం రైల్వే స్టేషన్‌లో కూడా జనం గోల మధ్య నిలబడి సీరియల్స్ సంభాషణ రాయగలం. అలా ప్రాక్టీస్ చేసాం.

ఇంకో తేడా మా పుస్తకాలు మేం వేసుకోము. నా మొదటి సీరియల్ ఆంధ్రజ్యోతి పత్రికలో రాస్తున్నప్పుడు, మూడోవారం ముగ్గురు పబ్లిషర్స్ ప్రచురిస్తాం అని ముందుకొచ్చారు. పదమూడో వారం ప్రముఖ నిర్మాత కె.యస్.రామారావుగారు వచ్చి ఆ నవలని సినిమాగా తియ్యడానికి రైట్స్ కొన్నారు. నా నవలలు ఎన్నడూ నేను పబ్లిష్ చేసుకోలేదు. ఉచితంగా ఎవరికీ పంచలేదు. పబ్లిషర్స్ ఒక్కోసారి హానరోరియమ్‌లు ముందుగా ఇచ్చిన సందర్భాలు కూడా వున్నాయి. అంతెందుకూ మొన్న నా పుస్తకం 'ఎందుకీ సందెగాలి' ఆవిష్కరణ

అనగానే తోటకూర ప్రసాద్ గారూ, సుబ్బూ జొన్నలగడ్డ గారూ డబ్బులు (డాలర్లలో) ఇచ్చి తీసుకున్నారు. అది పుడుతూనే సంపాదించింది. అదీ కమర్షియల్ రైటింగ్ అంటే అంతకు ముందు ఆవిష్కరించిన వాటికి అలా చెయ్యలేదు. అందుకే కమర్షియల్ రైటర్స్‌కి ఎవరూ పీట వెయ్యక్కర్లా. మా పీటలు మేం తెచ్చుకుంటాం.

మర్నాడు ఓ సాహితీవేత్త 'నువ్వెంత కుళ్ళిపోయినా కమర్షియల్ రైటర్స్‌ని మేం గౌరవించం' అన్నారు. మంచిదే హూ కేర్స్? వీళ్ళందరినీ కూడా ఇక్కడ వినడం, చూడడమే. పుస్తకాలు కొని చదవడానికి అసలు పేర్లే తెలీవు మాకు. అదే ఆ కన్వెన్షన్ సెంటర్ వరండాలో 'యద్ధనపూడి'ని కానీ 'వీరేంద్రనాథ్‌ని' కానీ (అఫ్‌కోర్స్ మల్లాదిగారిని ఆనవాలు పట్టలేరు) నడవమనండి చూద్దాం. జనం ఎలా వెంటపడి ఆటోగ్రాఫ్‌లు అడుగుతారో.

అంతెందుకు. కమర్షియల్ నవల లేనిదే టీ.వీ సీరియల్, సినిమా అనేదేలేదు. ఆ సినిమా వాళ్ళు లేకుండా ఏ సభకీ జనం రారు. అది కళ్ళముందు జరిగే వాస్తవం. కాదని అనలేని సత్యం.

చంద్రబోస్, హరీష్ శంకర్, వి.ఎన్.ఆదిత్యా, మేర్లపాక గాంధీ, నేనూ వున్న సినిమా సాహిత్యసభకి జనం క్రిక్కిరిసిపోయారు. కారణం నిద్రపోతున్న వాళ్ళని ప్రసంగాలు లేపాలి కానీ నిద్రపుచ్చకూడదు.

ఎక్కడో వంగూరి చిట్టెన్‌రాజుగారిలాంటి ఒకరు సాహిత్యం గురించి చెప్తూ తమాషాగా మాట్లాడ్తారు. మిగతా వాళ్ళు సీరియస్‌గా మా చిన్నప్పటి టీచర్ మార్తప్రభులా పాఠం చెప్తారు. జనం వెళ్ళిపోక ఏం చేస్తారు చెప్పండీ?


ఆ సభలో కమర్షియల్ రైటర్స్‌ని వాళ్ళు గుర్తించకపోవడం గురించి పెద్దగా పట్టించుకోకూడదు. ఎవరు గుర్తించకపోయినా చలం, శరత్, కొమ్మూరి, యద్ధనపూడీ, వీరేంద్రనాధ్, మల్లాదిలు జనానికి సాహిత్యంలో రుచి తెలియచేసారు. వాళ్ళు నిస్సందేహంగా గొప్పవాళ్ళు.


ఆఖరి సాహిత్య సభలో చంద్రబోస్ సినిమా సాహిత్యం గురించి మాట్లాడ్తుంటే, సభ క్రిక్కిరిసిపోయింది. జనానికి దగ్గరగా వుండి, వారి మనసులకి 'హితం' అయ్యేదే సాహిత్యం అని నాకు అనిపించింది.

ఒకావిడ నన్ను "సినిమా వాళ్ళతో పనిచేస్తారు. స్త్రీగా మీకు భయం వెయ్యదా?" అని అడిగింది ఆ సభ మొదలెట్టే ముందే! అటూ ఇటూ ఆదిత్యా, చంద్రబోస్, హరీష్ శంకర్‌లు కూర్చుని జోక్స్ వేస్తూ తమాషాగా మాట్లాడ్తుంటే నాకు అనిపించింది. "ఇందరు తమ్ముళ్ళు 'అక్కా' అని పిలుస్తుంటే, 'మా అమ్మాయి' అని అక్కినేని నాగేశ్వరరావుగారు, రామానాయుడుగారూ చెప్పేవారు కదా!. పరుచూరి బ్రదర్స్, సత్యానంద్‌గారూ, అల్లు అరవింద్‌గార్లలాంటి పెద్దలు సరదాగా నాతో జోక్స్ వేస్తూ మాట్లాడ్తారు కదా, ఏ కష్టమొచ్చినా 'మేం వున్నా'ం అంటారు కదా, ఈ ఇండస్ట్రీ నా పుట్టిల్లులాంటిదికదా. నాకేవిటి భయం? అని." అదే సభాముఖంగా చెప్పాను.

'డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డిగారిలాంటి గొప్పవాళ్ళు (సంపదలోనే కాదు వ్యక్తిత్వంలో కూడా) స్వయంగా వారి పొలాలు చూపించి చీరపెట్టి నన్ను ఒక రచయిత్రిగా ఆదరించారంటే మా కమర్షియల్ రైటర్స్ రచనలకి విలువుందనేగా అర్థం. ఏదైనా ఈ సాహిత్య సభలవల్ల నాకు బోలెడు అనుభవాలు జ్ఞాపకాలు మిగిలాయి

COMMENTS


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


సాహితి
కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి